'పది' పరీక్షలు ప్రారంభం

- మొదటి రోజు జిల్లా వ్యాప్తంగా 33 మంది విద్యార్థులు గైర్హాజరు
- జిల్లా కేంద్రంలోని పరీక్ష కేంద్రాలను తనిఖీ చేసిన కలెక్టర్
- పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశం

కమాన్‌చౌరస్తా, మార్చి 18 : జిల్లా వ్యాప్తంగా పదో తరగతి పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. మొత్తం 75 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయగా, మొదటి రోజు 12,458 మంది రెగ్యులర్ విద్యార్థులకు గానూ 12,445 మంది హాజరయ్యారు. అలాగే, ప్రైవేటు విద్యార్థులు 43 మందికి 23 మంది పరీక్ష రాశారు. జిల్లా కలెక్టర్ రెండు, అదనపు కలెక్టర్ ఒక కేంద్రాన్ని, రాష్ట్ర పరిశీలకులు ఆరు కేంద్రాలను, జిల్లా విద్యాశాఖాధికారి ఏడు పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు. జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక తనిఖీ బృందాలు 26 పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు. మొత్తం 49 పరీక్షల కేంద్రాల్లో పరీక్షల నిర్వహణను పరిశీలించారు. జిల్లా కేంద్రంలోని జ్యోతినగర్ సెయింట్ అల్ఫోన్స్ పాఠశాల, మంకమ్మతోటలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల(ధన్గర్ వాడీ) పదో తరగతి పరీక్ష కేంద్రాల తనిఖీ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, పదో తరగతి పరీక్షలను అధికారులు పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశించారు. పరీక్ష సమయంలో ఇబ్బందులు తలెత్తితే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. సెయింట్ అల్ఫోన్స్ పాఠశాలలో దివ్యాంగులు పరీక్ష రాస్తున్న గదిని కలెక్టర్ పరిశీలించారు. ఇక్కడ అధికారులు వేణు కుమార్, బీ రమేశ్ బాబు, చీఫ్ సూపరింటెండెంట్లు మోహన్ రెడ్డి, ప్రమోద, డీవో లక్ష్మణ రావు తదితరులు ఉన్నారు.

జమ్మికుంట/ వీణవంక/ హుజూరాబాద్ టౌన్/ మానకొండూర్/ శంకరపట్నం/ చిగురుమామిడి/ గన్నేరువరం, మార్చి 18: జమ్మికుంట మండలంలో 961 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా, తొలిరోజు 960 మంది హాజరయ్యారు. ఒక్క విద్యార్థి మాత్రమే గైర్హాజరయ్యాడని మండల విద్యాధికారి విడపు శ్రీనివాస్ తెలిపారు. వీణవంక మండలంలోని వీణవంక, ఘన్ముక్ల, చల్లూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయగా, మొత్తం 315 మంది విద్యార్థులు పరీక్షకు హాజరైనట్లు చీఫ్ సూపరింటెండెంట్లు సుద్దాల శోభారాణి, చంద్రకళ, సంపత్‌కు మారాచారి, ఎంఈవో విడపు శ్రీనివాస్ తెలిపారు. హుజూరాబాద్ మండలంలో మొత్తం 845 మంది విద్యార్థులకు గానూ ఆరుగురు విద్యార్థులు గైర్హాజరయ్యారని ఎంఈవో కేవీ నరసింహారెడ్డి వెల్లడించారు. మానకొండూర్ మండలంలో 464 మంది విద్యార్థులకు గానూ అందరూ పరీక్షకు హాజరైనట్లు ఆయా పరీక్ష కేంద్రాల చీఫ్ సూపరింటెండెట్లు తెలిపారు. మానకొండూర్ పరీక్ష కేంద్రాన్ని డీఈవో జనార్దన్‌రావు తనిఖీ చేశారు. శంకరపట్నం మండలంలో మొత్తం 333 మంది విద్యార్థులకు అందరూ పరీక్షకు హాజరైనట్లు ఇన్‌చార్జి ఎంఈవో వెంకట నర్సింహారెడ్డి తెలిపారు. చిగురుమామిడి మండలంలో మొత్తం 277 మంది విద్యార్థులకు అందరూ పరీక్షకు హాజరయ్యారని ఎంఈవో శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. గన్నేరువరం మండలంలో 206 మంది విద్యార్థులకు గానూ 205మంది పరీక్షకు హాజరు కాగా, ఒక్కరు గైర్హాజరయ్యారు.

ఎన్నికల నిబంధనలు విధిగా పాటించాలి

చొప్పదండి మండలం ఆర్నకొండ పోలీస్ చెక్ పోస్టులో వాహనాల తనిఖీని పరిశీలిస్తున్న జిల్లా ఎన్నికల అధికారి పమేలా సత్పతి

- సభలు, సమావేశాల నిర్వహణకు అనుమతి తప్పనిసరి
- ఓటర్లను ప్రలోభపెట్టే ఘటనలపై సీ విజిల్ యాప్‌లో ఫిర్యాదు చేయాలి
- జిల్లా ఎన్నికల అధికారి పమేలా సత్పతి

కలెక్టరేట్, మార్చి 18: జిల్లాలో పార్లమెంటు ఎన్నికల కోడ్ కొనసాగుతున్న నేపథ్యంలో రాజకీయ పార్టీల నాయకులు ఎన్నికల సంఘం నిబంధనలు విధిగా పాటించాలని జిల్లా ఎన్నికల అధికారి పమేలా సత్పతి సూచించారు. కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో సోమవారం రాజకీయపార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, పార్లమెంటు ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ ప్రకారం నడుచుకోవాలని, నిబంధనలు పాటించకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. సభలు, సమావేశాల నిర్వహణకు 48 గంటల ముందు అనుమతి తీసుకోవాలని స్పష్టం చేశారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే సిబ్బందికి పోస్టల్ బ్యాలెట్ పత్రాలు అందిస్తామన్నారు. ఓటర్లను ప్రలోభపెట్టే ఘటనలు గమనిస్తే, సీ విజిల్ యాప్‌లో అప్పటికప్పుడే ఫొటోలు, వీడియోలు తీసి పెట్టవచ్చన్నారు. ఈ సందర్భంగా ఎన్నికల నిబంధనలు, అనుమతులు, అభ్యర్థుల ఖర్చుల వివరాలు, రాజకీయ పార్టీల నాయకులకు అవగాహన కల్పించారు. పలు అంశాలను కలెక్టర్ దృష్టికి తీసుకురాగా, పరిశీలించి పరిష్కరించేందుకు సమ్మతించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు ప్రఫుల్ దేశాయ్, లక్ష్మీకిరణ్, డీఆర్వో పవన్‌కుమార్, ఆర్డీవో కే మహేశ్వర్, టౌన్ ఏసీపీ సురేందర్, రాజకీయ పార్టీల నాయకులు మడుపు మోహన్, నాంపల్లి శ్రీనివాస్, అనిల్‌కుమార్, కళ్యాడపు ఆగయ్య, మిల్కూరి వాసుదేవ రెడ్డి, శివ, అధికారులు పాల్గొన్నారు.

ఆర్నకొండలోని చెక్‌పోస్ట్ పరిశీలన

చొప్పదండి, మార్చి18: ఎన్నికల నేపథ్యంలో జిల్లా సరిహద్దు గ్రామం చొప్పదండి మండలం ఆర్నకొండలో ఏర్పాటు చేసిన పోలీస్ చెక్ పోస్టును సోమవారం జిల్లా ఎన్నికల అధికారి పమేలా సత్పతి పరిశీలించారు. ఈ సందర్భంగా వాహనాల తనిఖీకి సంబంధించిన వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని, నగదు, మద్యం, ఇతర వస్తువుల అక్రమ తరలింపును అడ్డుకోవాలని చెప్పారు. కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, తహసీల్దార్ నరేందర్, ఎస్ఐ ఉపేంద్రాచారి ఉన్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు: సీపీ

రాంనగర్, మార్చి 18: లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో ప్రజలు, రాజకీయ పార్టీలు ఎన్నికల నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని కరీంనగర్ పోలీస్ కమిషనర్ అభిషేక్ మహంతి కోరారు. ఈ మేరకు పలు నిబంధనలు, సూచనలతో ప్రకటన విడుదల చేశారు. ఎన్నికల సంబంధిత సభలు, సమావేశాలు, ర్యాలీల నిర్వహణకు అనుమతి తప్పనిసరని, లేకపోతే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. డీజే సౌండ్స్ సిస్టమ్‌ను ఎవరూ వినియోగించవద్దని తెలిపారు. ఉదయం 6కు ముందు రాత్రి 10 గంటల తర్వాత అనుమతి పొందినా లౌడ్ స్పీకర్ వినియోగించకూడదని పేర్కొన్నారు. దేవాలయాలు, మసీదులు, చర్చి, ఇతర ప్రార్థన స్థలాలను ఎన్నికల ప్రచారం కోసం వినియోగించవద్దని తెలిపారు. ఎన్నికల ప్రచారం కోసం వాడే వాహనాలకు అనుమతి పత్రాన్ని కనిపించేలా అతికించాలని పేర్కొన్నారు. సోషల్ మీడియాలో రెచ్చగొట్టే వ్యాఖ్యలు, వ్యక్తిగతంగా కించపరిచే పోస్టులు పెట్టిన వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

పోలీస్ కమిషనర్ అభిషేక్ మహంతి

అక్రమ మద్యం రవాణా, డబ్బు పంపిణీ, ఉచితంగా వస్తువుల పంపిణీ లాంటి వాటిపై కఠిన చర్యలు తప్పవని తెలిపారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా, ఎన్నికల విధులు నిర్వహించే పోలీసు అధికారులందరికీ అన్ని వర్గాల ప్రజలు సహకరించాలని కోరారు.

ఇకపై సోమవారమే ఫిర్యాదుల స్వీకరణ

లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ వెలువడిన నేపథ్యంలో కమిషనరేట్‌లో ఇకనుంచి ఫిర్యాదులు సోమవారం మాత్రమే స్వీకరించనున్నట్లు సీపీ అభిషేక్ మహంతి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల విధుల్లో పోలీసులు నిమగ్నమైనందున ఇకముందు కమిషనరేట్ ఫిర్యాదుల సెల్‌లో ప్రతి సోమవారం మాత్రమే ఫిర్యాదులు స్వీకరించనున్నారని పేర్కొన్నారు. ప్రజలు సహకరించాలని పోలీస్ కమిషనర్ కోరారు.

విస్తృతంగా వాహన తనిఖీలు

అక్రమంగా డబ్బు, మద్యం, ఇతర వస్తువులు రవాణాకు అడ్డుకట్ట వేసేందుకు సీపీ ఆదేశాల మేరకు కమిషనరేట్ వ్యాప్తంగా సోమవారం ఆకస్మికంగా వాహన తనిఖీలు చేపట్టారు. కరీంనగర్ వన్, టూ, త్రీ టౌన్ పరిధిలోని బస్‌స్టాండ్ ఏరియా, నాకాచౌరస్తా, గీతాభవన్‌తో తదితర ప్రాంతాల్లో వాహన తనిఖీలతో పాటు డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు సైతం నిర్వహించారు. ఎన్నికల నియమావళి ముగిసే వరకు వాహన తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని తెలిపారు.

తెలంగాణ అమరుడికి ఘన నివాళి

చెంజర్లలో తెలంగాణ అమరుడు రాజేశ్ గౌడ్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు

మానకొండూర్ రూరల్, మార్చి 18: మండలంలోని చెంజర్ల గ్రామానికి చెందిన తెలంగాణ అమరుడు సుధగోని రాజేశ్ గౌడ్ వర్ధంతి కార్యక్రమాన్ని సోమవారం గ్రామంలో బీఆర్ఎస్ నాయకులు, కుటుంబ సభ్యులు నిర్వహించారు. ముఖ్య అతిథిగా బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు హాజరై, రాజేశ్ విగ్రహానికి పూల మాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, తెలంగాణ ఉద్యమంలో రాజేశ్ సేవలు మరువలేనివని కొనియాడారు. ఆయన తల్లిదండ్రులకు పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉన్నదని గుర్తు చేశారు. కార్యక్రమంలో జడ్పీటీసీ తాళ్లపల్లి శేఖర్ గౌడ్, మాజీ సర్పంచ్ బొల్ల వేణుగోపాల్, నాయకులు గడ్డి గణేశ్, ఆడెపు రమేశ్, పడాల శంకరయ్య, నెల్లి శంకర్, ఎండీ గౌస్ తదితరులు ఉన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

జ్యోతిష్మతి విద్యా సంస్థల చైర్మన్ జువ్వాడి సాగర్‌రావు



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న జ్యోతిష్మతి చైర్మన్ సాగర్ రావు

తిమ్మాపూర్ రూరల్, మార్చి 18 : క్రీడలతో శారీరక దృఢత్వంతోపాటు మానసికోల్లాసం కలుగుతుందని జ్యోతిష్మతి విద్యా సంస్థల చైర్మన్ జువ్వాడి సాగర్‌రావు పేర్కొన్నారు. సోమవారం మండలంలోని జ్యోతిష్మతి అటానమస్ కళాశాల ప్రాంగణంలో నిర్వహించిన స్పోర్ట్స్ ఫీస్టా- 2024 కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఇందులో భాగంగా 12 రోజుల పాటు జరిగే పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొనాలని సూచించారు. చదువుతోపాటు ఆటల్లోనూ రాణిస్తూ కళాశాలకు, తల్లిదండ్రులకు పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. విద్యార్థులకు క్రికెట్, వాలీబాల్, చెస్, క్యారం, త్రో బాల్, టేబుల్ టెన్నిస్, బాస్కెట్ బాల్ పోటీలు ఉంటాయని తెలిపారు. అనంతరం టాస్ వేసి క్రికెట్ పోటీలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ కేఎస్ రావు, డీన్ అకాడమిక్స్ డాక్టర్ వైశాలి, డీన్ స్టూడెంట్ అఫైర్స్ డాక్టర్ పీ సంపత్‌రావు, కో ఆర్డినేటర్స్ సీహెచ్ సజన్‌రావు, రాజేశ్‌గుణ, సత్య తేజ, ఉదయ్, ప్రకాశ్ పాల్గొన్నారు.

కరువుభత్యం బకాయిలు విడుదల చేయాలి

కలెక్టరేట్, మార్చి 18 : తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు అందజేయాల్సిన నాలుగు విడుతల కరువుభత్యం బకాయిలను, ముఖ్య ఎన్నికల అధికారి అనుమతితో సత్వరమే విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎస్ జనార్దన్‌రావు డిమాండ్ చేశారు. బకాయిలు వెంటనే విడుదల చేస్తే విశ్రాంత ఉద్యోగులు ఆర్థిక ఇబ్బందుల నుంచి తాత్కాలిక వెసులుబాటు పొందుతారని సోమవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు.

పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

శంకరపట్నం, మార్చి 18: సరైన పోషకాహారం తీసుకోవడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యంతో జీవించవచ్చని ఏసీడీపీవో అరవింద తెలిపారు. సోమవారం ఏరడపల్లి గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ్ అభియాన్‌లో భాగంగా పోషణ పక్షం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, పోషకాహార ఆవశ్యకతపై గర్భిణులు, బాలింతలు అవగాహన కలిగి ఉండాలని సూచించారు. అలాగే గర్భిణులకు సీమంతం, చిన్నారులకు అన్నప్రాసన చేశారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ స్రవంతి, అంగన్‌వాడీ టీచర్లు శోభ, స్వరూప, సుభద్ర, ఏఎన్ఎంలు, తల్లులు పాల్గొన్నారు.

మహాజన సోషలిస్ట్ పార్టీ నూతన కమిటీ

హుజూరాబాద్ టౌన్, మార్చి18: మహాజన సోషలిస్టు పార్టీ హుజూరాబాద్ కమిటీ ఎన్నికలు సోమవారం పట్టణంలోని ఎంఎస్పీ నియోజకవర్గ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు తునికి వసంత్ అధ్యక్షతన జరిగాయి. పార్టీ హుజూరాబాద్ నియోజకవర్గ కన్వీనర్‌గా కనుకులగిద్ద గ్రామానికి చెందిన ఆళ్ల కేశవులు, మండల కన్వీనర్‌గా సిర్సపల్లి గ్రామానికి చెందిన తునికి భాస్కర్, కో కన్వీనర్లుగా బొడ్డు సంపత్, కల్వల వీరస్వామి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

ఎంపీహెచ్‌ఎస్ ఆవిర్భావ వేడుకలు

శంకరపట్నం, మార్చి 18: మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద సోమవారం మాదిగ హక్కుల పరిరక్షణ సమితి (ఎంపీహెచ్ఎస్) ఆవిర్భావ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీహెచ్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ సముద్రాల సంపత్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. అనంతరం ప్రయాణికులకు స్వీట్లు, పండ్లు పంచారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఎస్ జిల్లా అధ్యక్షుడు మంద శ్రీనివాస్ మాదిగ, ఆల్ ఇండియా అంబేద్కర్ సంఘం నియోజకవర్గ ఇన్‌చార్జి దేవునూరి కిష్టయ్య, నాయకులు వెంకటేశ్, శ్రీధర్, శంకర్, రాజు, తిరుపతి, సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

జేసీబీ ఓనర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం

వీణవంక జేసీబీ ఓనర్స్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడు నర్సయ్య తదితరులు

వీణవంక, మార్చి 18: మండలంలోని జేసీబీ యజమానుల అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని సోమవారం మండల కేంద్రంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండలాధ్యక్షుడిగా పోతుల నర్సయ్య (రెడ్డిపల్లి), ఉపాధ్యక్షుడిగా ప్రకాశ్ (కనపర్తి), ప్రధాన కార్యదర్శిగా ఎంఏ హమీద్(వీణవంక), కోశాధికారిగా దాసారపు కృష్ణచైతన్య(వీణవంక), గౌరవ సలహాదారుగా రామగుండం రాజ్‌కుమార్ (కొండపాక) ఎన్నికయ్యారు. కార్యక్రమంలో మహంకాళి రాజ్ కుమార్, ఎంఏ సాజిద్ పాషా, నీల శ్రీకాంత్, తిరుపతిరెడ్డి, వీరస్వామి, సంపత్, భిక్షపతి, చిరంజీవి, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

'జిజ్ఞాస' రాష్ట్రస్థాయి పోటీలకు ఐదు ప్రాజెక్టులు ఎంపిక

హుజూరాబాద్‌టౌన్, మార్చి18: హుజూరాబాద్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల నుంచి జిజ్ఞాస రాష్ట్ర స్థాయి పోటీలకు ఐదు స్టూడెంట్ స్టడీ ప్రాజెక్టులు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ డా. పీ ఇందిరాదేవి తెలిపారు. సోమవారం కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మాట్లాడుతూ, తెలుగు, కామర్స్, ఎకనామిక్స్, హిస్టరీ, గణితం సబ్జెక్టుల నుంచి జిజ్ఞాస స్టూడెంట్ స్టడీ ప్రాజెక్టులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక కావడం కళాశాలకు గర్వకారణమన్నారు. ఈ సందర్భంగా పర్యవేక్షక ఉపన్యాసకులు ఎస్ మధు (తెలుగు), డా. జీ శ్రీనివాస్ (కామర్స్), ఎస్ శ్యామలాదేవి(ఎకనామిక్స్), ఎస్ సమ్మయ్య(హిస్టరీ), డీ స్వరూపారాణి (గణితం)తోపాటు పరిశోధక విద్యార్థులను ప్రిన్సిపాల్ తోపాటు వైస్ ప్రిన్సిపాల్ పీ లక్ష్మీనరసింహామూర్తి, ఐక్యుఏసీ కో ఆర్డినేటర్ డా. పీ దినకర్, స్టాఫ్ సెక్రటరీ కే రమేశ్, అధ్యాపకులు ఉదయశ్రీ, గొడిశాల పరమేశ్, హరిప్రసాద్, రాజ్‌కుమార్, నాగ పరమేశ్వరాచారి, స్వప్న అభినందించారు.

జాతీయస్థాయి యోగాసన్ స్పోర్ట్స్ చాంపియన్‌షిప్‌కు ఎంపిక

కొత్తపల్లి, మార్చి 18 : స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలకు చెందిన అర్థశాస్త్ర అధ్యాపకురాలు మార్కొండ శకుంతల జాతీయస్థాయి యోగాసన్ స్పోర్ట్స్ చాంపియన్‌షిప్‌కు ఎంపికైంది. ఇటీవల తెలంగాణ రాష్ట్రస్థాయి యోగాసన్ స్పోర్ట్స్ చాంపియన్‌షిప్‌లో పాల్గొన్న ఆమె ప్రథమ స్థానం సాధించి, జాతీయ పోటీలకు అర్హత సాధించింది. పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలోని హుగ్లీలో ఈ నెల 19 నుంచి 23 వరకు జరిగే సీనియర్ జాతీయ స్థాయి యోగాసన్ స్పోర్ట్స్ చాంపియన్‌షిప్‌లో పాల్గొననున్నది. జాతీయ స్థాయి యోగా పోటీలకు ఎంపికైన శకుంతలను కళాశాల ప్రిన్సిపాల్, కళాశాల సిబ్బంది అభినందించారు.

నిర్భయంగా ఓటు వేయండి

కవాతు నిర్వహిస్తున్న కేంద్ర బలగాలు

తిమ్మాపూర్, మార్చి18: ఓటర్లు రానున్న లోక్ సభ ఎన్నికల్లో నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని, ఎలాంటి ప్రలోభాలకు లోను కావద్దని తిమ్మాపూర్ సీఐ కే స్వామి సూచించారు. మండల కేంద్రంలో సోమవారం కేంద్ర బలగాలతో కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎన్నికల్లో ఏమైనా అవకతవకలు చోటు చేసుకుంటే తమకు గానీ, ఎన్నికల అధికారులకు గానీ ఫిర్యాదు చేయాలన్నారు. కార్యక్రమంలో సీఐఎస్ఎఫ్ సీనియర్ ఇన్‌స్పెక్టర్ విక్రంత్ షాకిన్, ఎల్ఎండీ ఎస్ఐ చేరాలు, ఆర్ఎస్ఐ రాజు, సిబ్బంది పాల్గొన్నారు.

ఫిషరీస్ ఫెడరేషన్ చైర్మన్ పదవి ముదిరాజ్‌లకు కేటాయించాలి

తెలంగాణచౌక్, మార్చి18: తెలంగాణ రాష్ట్ర మత్స్య సహకార సంఘాల సమాఖ్య (ఫిషరీస్ కో ఆపరేటివ్ సొసైటీస్ ఫెడరేషన్) చైర్మన్ పదవిని ముదిరాజ్ కులస్తులకు కేటాయించాలని మన తెలంగాణ ముదిరాజ్ మహాసభ మత్స్య కారుల విభాగం రాష్ట్ర అధ్యక్షుడు మంద నగేశ్ ముదిరాజ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నగరంలోని ప్రెస్ భవనంలో సోమవారం సంఘం రాష్ట్ర, జిల్లా కమిటీ సభ్యులతో కలిసి ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో పెద్ద కమ్యూనిటీ గల ముదిరాజ్‌లకు కాకుండా ఫిషరీస్ ఫెడరేషన్ పదవిని గంగపుత్రులకు కేటాయించడంపై ప్రభుత్వం పునరాలోచన చేయాలన్నారు. నామినేటెడ్ పద్ధతిలో కాకుండా ప్రజాస్వామ్య పద్ధతిలో అన్ని సహకార సంఘాలకు ఎన్నికలను నిర్వహించి, ఎన్నికైన కమిటీల సభ్యులతో ఫెడరేషన్ చైర్మన్ ఎన్నుకునేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో కాంగ్రెస్ కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు మామిడి తిరుపతి, నాయకులు కనకయ్య, మహేందర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

'ప్రభుత్వాలకు సీట్లపై ఉన్న ధ్యాస రైతులపై లేదు'

వీణవంక, మార్చి 18: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ఓట్లు, సీట్లపై ఉన్న ధ్యాస రైతులపై లేదని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వర్ణ వెంకట్‌రెడ్డి విమర్శించారు. ఎలుబాక గ్రామంలో అకాల వర్షానికి దెబ్బతిన్న వరి, మక్క పంటలను సోమవారం సీఐటీయూ మండల కన్వీనర్ పిల్లి రవి యాదవ్, రైతులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అకాల వర్షాల వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని, రాష్ట్ర ప్రభుత్వం వెంటనే అధికారులతో పంట నష్టాన్ని అంచనా వేయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఈవో శ్రీకాంత్, స్థానిక రైతులు మూదం బుచ్చయ్య, రొండ్ల ఐలయ్య, మడికొండ ఎల్లయ్య, మాడ తిరుపతిరెడ్డి, నూగిల శంకర్, సతీశ్, కుమార్ పాల్గొన్నారు.

పరిశోధనలకు ఉపయోగపడేలా మెథడాలజీ కోర్సు

కార్యక్రమంలో పాల్గొన్న వీసీ, తదితరులు

- ఎస్‌యూ వీసీ మల్లేశ్ సంకశాల

కమాన్‌చౌరస్తా, మార్చి 18 : పరిశోధక విద్యార్థులకు ఉపయోగపడేలా మెథడాలజీ కోర్సు శాతవాహన యూనివర్సిటీలో నిర్వహించడం మంచి పరిణామమని, ఇలాంటి కార్యక్రమాలకు ఎప్పుడూ తమ ప్రోత్సాహం ఉంటుందని వీసీ ప్రొఫెసర్ మల్లేశ్ సంకశాల పేర్కొన్నారు. శాతవాహన విశ్వవిద్యాలయం డిపార్ట్‌మెంట్ ఆఫ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'సెవెన్ డే రీసెర్చ్ మెథడాలజీ కోర్స్ ఫర్ పీహెచ్‌డీ స్టూడెంట్స్ అండ్ యంగ్ ఫ్యాకల్టీ ఇన్ సోషల్ సైన్సస్ ఇన్ తెలంగాణ రీజియన్' ప్రారంభ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఏడు రోజుల రీసెర్చ్ మెథడాలజీ కోర్స్ విశ్వవిద్యాలయంలో నిర్వహించడం చాలా ఆనందంగా ఉన్నదన్నారు. విశిష్ఠ అతిథిగా హాజరైన ఐసీఎస్ఎస్ఆర్ సదరన్ రీజియన్ ప్రొఫెసర్ బీ సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ, ఇలాంటి కార్యక్రమాలకు ఐసీఎస్ఎస్ఆర్ ఆర్థికపరమైన సహాయం చేయటానికి ముందుకు వస్తుందని, పరిశోధక విద్యార్థులు ఇలాంటి కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమానికి కోఆర్డినేటర్‌గా వ్యవహరించిన బోర్డు ఆఫ్ స్టడీస్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ చైర్ పర్సన్, ఎగ్జామినేషన్స్ కంట్రోలర్ డాక్టర్ ఎన్‌వీ శ్రీరంగప్రసాద్ మాట్లాడుతూ, కోర్సులో భాగంగా వివిధ కేంద్ర, రాష్ట్ర విశ్వవిద్యాలయాల నుంచి 14 మంది ఆచార్యులు వివిధ అంశాల పైన సెషన్స్ తీసుకోనున్నారని తెలిపారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ఆచార్య వరప్రసాద్, డాక్టర్ డీ హరికాంత్, డాక్టర్ ఈ మనోహర్, డాక్టర్ మనోజ్ కుమార్, డాక్టర్ కృష్ణకుమార్, డాక్టర్ తిరుపతి, బీ నరేశ్, డాక్టర్ పరశురాములు తదితరులు పాల్గొన్నారు.

'పాఠశాలకు విరాళాలివ్వండి'

తిమ్మాపూర్, మార్చి18: మండలంలోని మహాత్మానగర్‌లో గల మానసిక వికలాంగుల పాఠశాల నిర్వహణకు దాతలు విరాళాలు ఇవ్వాలని ట్రస్ట్ చైర్మన్, సీపీఐ జాతీయ నేత చాడ వెంకట రెడ్డి కోరారు. సోమవారం పాఠశాల ఆవరణలో తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పాఠశాల నిర్వహణకు కేంద్ర ప్రభుత్వం స్వల్పంగా రూ.16లక్షల నిధులను మాత్రమే ఇచ్చిందని, పాఠశాల నిర్వహణకు ఏటా రూ.62 లక్షల వ్యయం అవుతుందని తెలిపారు. వివిధ సంస్థల విరాళాలు, అప్పులు తెచ్చి పాఠశాలను నడిపిస్తున్నామని, తల్లిదండ్రులు, సహృదయులు విరాళాలు అందజేయాలని కోరారు. సేవాభావంతో విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ట్రస్ట్ సభ్యులు సముద్రాల జనార్దన్ రావు, గాజుల భగవాన్, జాప వెంకటరమణారెడ్డి, సైకాలజిస్ట్ గాలిపల్లి నాగేశ్వర్, ముదుగంటి సుధాకర్ రెడ్డి, ఏవో బాలరాజు, ప్రిన్సిపాల్ సతీశ్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వీఎస్‌ఆర్‌లో సాంస్కృతిక వార్షికోత్సవాలు

హుజూరాబాద్ రూరల్, మార్చి18: సింగాపూర్‌లోని వీఎస్ఆర్ డిగ్రీ కళాశాలలో సోమవారం వీబీజీఆర్ సాంస్కృతిక వార్షికోత్సవాలను ప్రిన్సిపాల్ డాక్టర్ వీవీఎన్ హనుమకుమార్ ప్రారంభించారు. ఇందులో భాగంగా ఆటలు, పాటలు, ఉపన్యాస పోటీలు, డ్యాన్స్, వ్యాసరచన, వస్త్ర అలంకరణ, వంటల పోటీలు, ఫిల్మ్ ఫెస్టివల్స్ వంటి కార్యక్రమాలు ఉంటాయని ఆయన తెలిపారు.

ఉద్యోగోన్నతిపై జైలు సూపరింటెండెంట్ బదిలీ

రాంనగర్, మార్చి 18: జిల్లా జైలు సూపరింటెండెంట్ సమ్మయ్య ఉద్యోగోన్నతిపై చెర్లపల్లి జైలుకు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో సబ్ జైల్ ఆఫీసర్ శ్రీనివాస్‌కు జైలు సూపరింటెండెంట్‌గా బాధ్యతలు అప్పగించారు. ఉద్యోగోన్నతితో బదిలీపై వెళ్తున్న సమ్మయ్యకు జిల్లా జైలులో వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో జైలర్లు శ్రీనివాస్, రమేశ్, డిప్యూటీ జైలర్లు శ్రీనివాస్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, రమేశ్, సంగీత, జైలు డాక్టర్ వేణుగోపాల్, నాన్ ఆఫీషియల్ మెంబర్లు డాక్టర్ రమణాచారి, అడ్వకేట్ రఘునందన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

పరీక్ష ఫీజు చెల్లింపు గడువు 22

కమాన్‌చౌరస్తా, మార్చి 18 : శాతవాహన యూనివర్సిటీ పరిధిలో హోటల్ మేనేజ్‌మెంట్ 2, 4, 6వ సెమిస్టర్ విద్యార్థులు పరీక్ష ఫీజు ఈ నెల 22వ తేదీలోగా చెల్లించాలని పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ శ్రీరంగ ప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అపరాధ రుసుము రూ. 300తో 27వ తేదీ వరకు చెల్లించవచ్చని తెలిపారు.

26 నుంచి బీఫార్మసీ పరీక్షలు

శాతవాహన యూనివర్సిటీ పరిధిలో బీ ఫార్మసీ మొదటి, రెండో సెమిస్టర్ పరీక్షలు ఈ నెల 26 నుంచి ప్రారంభమవుతాయని పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ శ్రీరంగ ప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. యూనివర్సిటీ ఫార్మసీ కళాశాలను పరీక్ష కేంద్రంగా కేటాయించినట్లు చెప్పారు.

మాజీ ఎమ్మెల్యే పరామర్శ

గంగాధర, మార్చి 18: గట్టుభూత్కూర్ గ్రామానికి చెందిన బొమ్మరవేణి దశరథం ఇటీవల మృతి చెందగా, సోమవారం బాధిత కుటుంబాన్ని మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ పరామర్శించారు. రూ.5 వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబ సభ్యులు మాజీ ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. ఇక్కడ మాజీ సర్పంచ్ కంకణాల విజేందర్‌రెడ్డి, నాయకులు బొల్లబత్తిని సురేశ్, బుర్ర అజయ్, బుర్ర లక్ష్మీనారాయణ, బొల్లబత్తిని రాకేశ్, బాబు రమేశ్, రామంచ సురేశ్, గుణశేఖర్, తులసి, వంశీ, శ్యాం, అజయ్ తదితరులున్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ముకరంపుర, మార్చి18: కొత్త ట్రాన్స్‌ఫార్మర్ పనులు చేపడుతున్నందున మంగళవారం మధ్యాహ్నం 3నుంచి సాయంత్రం 5గంటల వరకు 11కేవీ రేకుర్తి ఫీడర్‌కు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు కరీంనగర్ రూరల్ ఏడీఈ కొలుపుల రాజు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇందిరమ్మ కాలనీ, పారడైస్ స్కూల్, బుడిగ జంగాల కాలనీ, విజయపురి కాలనీ, పాతవాడ, కొత్త వాడ, ఐ హాస్పిటల్ రోడ్డు, సాలెహ్ నగర్, హనుమాన్ నగర్ ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు. వినియోగదారులు గమనించి, సహకరించాలని కోరారు.

చరిత్ర పరిశోధకుడికి కీర్తి పురస్కారం

డా శ్రీనివాసరాజు

కొత్తపల్లి, మార్చి 18 : ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన చరిత్ర పరిశోధకుడు డాక్టర్ చెన్నమాధవుని శ్రీనివాసరాజు పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం కీర్తి పురస్కారానికి ఎంపికయ్యారు. మంగళవారం హైదరాబాద్‌లో జరుగనున్న కార్యక్రమంలో శ్రీనివాసరాజు పురస్కారాన్ని అందుకోనున్నారు. మరుగున పడిన చారిత్రక వాస్తవాలను వెలికితీయడం, చారిత్రక నేపథ్యంలో ఆయన చేసిన రచనలను గుర్తించిన తెలుగు విశ్వవిద్యాలయం కీర్తి పురస్కారాన్ని ప్రకటించింది. డా. చెన్నమాధవుని శ్రీనివాసరాజు ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని బోయినపల్లి మండలం వెంకట్రావుపల్లి గ్రామానికి చెందిన వారు.

ముదిమాణిక్యంలో పోషణ్ పక్వాడ

చిగురుమామిడి, మార్చి 18: మండలంలోని ముదిమాణిక్యం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషణ్ పక్వాడ కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనికి ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు ఇందిర, రాజశ్రీ హాజరయ్యారు. గర్భిణులు, బాలింతలు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అలాగే ఐసీడీఎస్ ద్వారా పంపిణీ చేస్తున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం చిన్నారులకు అన్నప్రాసన, అక్షరాభ్యాసం, గర్భిణులకు సీమంతం నిర్వహించారు. అంగన్‌వాడీ టీచర్లు విజయ కుమారి, మాధవి లత, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎన్నికల నిబంధనల ఉల్లంఘనపై కేసు

రాంనగర్, మార్చి 18: ఎన్నికల నిబంధనలు అమల్లోకి వచ్చిన తర్వాత కరీంనగర్ పరిధిలోని కిసాన్‌నగర్‌లో గల ఓ ప్రార్థనా మందిరంలో అనుమతి లేకుండా అధికార పార్టీ ఎమ్మెల్యేను సన్మానించిన ఘటనపై కేసు నమోదైంది. కిసాన్‌నగర్‌లోని బెతెస్త చర్చి కార్యదర్శి తిమోతి, నిర్వాహకులు ఈ నెల 17న మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణను సన్మానించారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉండగా కార్యక్రమం నిర్వహించడంపై ఎన్నికల అధికారి ఇచ్చిన ఫిర్యాదు మేరకు నిర్వాహకులపై కేసు నమోదు చేశారు.

అయిదుగురు బైండోవర్

తిమ్మాపూర్, మార్చి 18: మండలంలో నిబంధనలకు విరుద్ధంగా బెల్ట్ షాపులు నిర్వహిస్తున్న ఐదుగురిని బైండోవర్ చేసినట్టు తిమ్మాపూర్ ఎక్సైజ్ సీఐ ఎస్ బాబా సోమవారం తెలిపారు. గ్రామాల్లో అక్రమంగా మద్యం అమ్మకాలు చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఎంసీహెచ్‌లో సిబ్బంది క్రమశిక్షణ ఉల్లంఘన

- సోషల్ మీడియాలో వీడియో వైరల్
- చర్యలకు సిఫారసు చేసిన సూపరింటెండెంట్

విద్యానగర్, మార్చి 18 : కరీంనగర్ ప్రభుత్వ దవాఖానలోని మాతా శిశు ఆరోగ్య కేంద్రంలో సిబ్బంది క్రమశిక్షణ ఉల్లంఘించిన ఓ వీడియో సోమవారం సోషల్ మీడియాలో వైరల్ అయింది. దీనిపై స్పందించిన దవాఖాన సూపరింటెండెంట్ డాక్టర్ వీరారెడ్డి చర్యల కోసం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సుజాతకు సిఫారసు చేశారు. ఎంసీహెచ్ ల్యాబ్‌లో ఎన్‌హెచ్ఎం కింద పనిచేసే ఓ ల్యాబ్ టెక్నీషియన్ నైట్ షిఫ్ట్‌లో పనిచేస్తున్న సిబ్బందితో కలిసి విందు చేసుకునే వీడియో వైరల్ కావడంతో విధుల్లో ఉన్న సిబ్బంది దవాఖానలో ఇలాంటి చేష్టలు చేయడం నేరమని, వీరిపై చర్యల కోసం ఉన్నతాధికారులకు వివరించినట్లు తెలిపారు. దవాఖాన సిబ్బంది విధుల్లో నిర్లక్ష్యం చేసినా, క్రమశిక్షణ ఉల్లంఘించినా చర్యలు తీసుకుంటామని సూపరింటెండెంట్ హెచ్చరించారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED

CHANGE OF NAME
★I, ADAPELLY VINEETHA, R/o. 2-123/1/1, Seetharampur, Karimnagar, TS. Changed My Name as CHATTA VINEETHA, W/o. Adapelly Rakesh.
NT-328422

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.